## క్లుప్తంగా

### రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

**మధిర:** కల్లూరులో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో నిర్వహించిన 67వ ఎస్‌జీఎఫ్ అండర్ 17 ఖోఖో డిస్ట్రిక్ట్ సెలక్షన్‌లో భాగంగా మధిర విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యారు. తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్ (టీఎంఆర్ ఎస్అండ్ జేసీ)మధిర బాయ్స్ వన్ విద్యార్థులు ఈ వెంకటేష్, ఎస్.కె అమీర్ పాషా రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 13, 14 తేదీల్లో వనపర్తిలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో వారు ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టులో పాల్గొంటారని టీఎంఆర్ఎస్అండ్ జేసీ మధిర బాయ్స్ వన్ ప్రిన్సిపల్ ఎస్.కె షమీమ్ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టుకు వెంకటేష్ నాయకత్వం వహిస్తాడని పేర్కొన్నారు.

### బ్యాంకు సేవలపై అవగాహన

**మధిరరూరల్:** ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ సిరిపురం శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని రొంపిమల్ల గ్రామంలో బ్యాంకు అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో బ్రాంచ్ మేనేజర్ రవికుమార్ పాల్గొని మాట్లాడుతూ.. పొదుపు పథకాలు, జీవిత బీమా, ప్రభుత్వం నుంచి మంజూరయ్యే సబ్సిడీలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

### ఉన్నత లక్ష్యంతో చదవండి

**సత్తుపల్లి:** విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఉన్నత లక్ష్యాలను సాధించాలని పట్టణ సీఐ మోహన్‌బాబు అన్నారు. పట్టణంలోని శ్రీనారాయణ కళాశాలలో గురువారం ఎంసెట్, మెయిన్స్, జాబ్స్ ఓరియంటేషన్ కోచింగ్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నల్లన్‌చక్రవర్తుల, రామకృష్ణమాచార్య, ప్రిన్సిపల్ రాజాకృష్ణ, నవకుమార్, నాగేశ్వరరావు, మురళీకృష్ణ, శ్రీను, రాజశేఖర్ పాల్గొన్నారు.

### అమరవీరుల ఆశయాలను సాధిద్దాం..

**మధిర:** టీఎస్‌ఆర్‌టీసీ అమరవీరుల ఆశయాలను సాధిద్దామని ఆర్టీసీ జేఏసీ నాయకులు తిమ్మినేని రామారావు, నాగేశ్వరరావు తెలిపారు. గురువారం మధిర డిపో వద్ద ఆర్టీసీ రక్షణ – కార్మికుల త్యాగాల దినంగా జరపాలని రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఎంప్లాయీస్ యూనియన్, స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అమరులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు రామచంద్రరావు, వెంకటేశ్వర్లు, టీసీఎన్ రెడ్డి, కాలేషా, వెంకన్న, పద్మావతి, గోపాలకృష్ణ, నీలిమ పాల్గొన్నారు.

### దళితబంధు బీఆర్ఎస్ కార్యకర్తలకేనా..?

**కల్లూరు:** దళితబంధు పథకం అర్హులందరికీ ఇవ్వాలని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. గురువారం కల్లూరు మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు గుమ్మా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు మా పార్టీలో చేరితేనే.. దళితబంధు, గృహలక్ష్మి పథకాలు వస్తాయనడం సరికాదన్నారు. దీనిపై గవర్నర్‌ను, ఎలక్షన్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ని వీరంరాజు, మండల ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి అనీల్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

### 11నుంచి దేశవ్యాప్త ఆందోళనలు

**తల్లాడ:** ఉపాధి హామీ చట్టం కోసం ఈ నెల 11నుంచి దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్ పేర్కొన్నారు. తల్లాడలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం గురువారం మెరుగు సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా పని చేస్తున్న 15 కోట్ల కుటుంబాలలో జాబ్ కార్డు దారులకు నగదు రహిత చెల్లింపుల పేరుతో కూలీలు, బ్యాంక్ ఎకౌంట్, ఆధార్ కార్డు నమోదు చేసిందన్నారు. అయినా కూలీలకు వేతనాలు పడటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, యార్ల శ్రీనివాసరావు, గద్దల రత్తమ్మ, బందం శ్రీనివాసరావు, శీలం సత్యనారాయణరెడ్డి, అయినాల రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### సీపీఎం నిరసన ప్రదర్శన

**తల్లాడ:** ఢిల్లీలో జర్నలిస్టులపై జరిగిన దాడిని ఖండిస్తూ గురువారం తల్లాడలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. బీజేపీ ప్రభుత్వం ప్రధాన మోదీ అధికారం చేపట్టిన నాటి నుంచి దాడులు జరుగుతున్నాయనీ వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బుర్రి ప్రసాద్, శీలం సత్యనారాయణరెడ్డి, అయినాల రామలింగేశ్వరరావు, యర్రా శ్రీనివాసరావు, జాజిరి శ్రీనివాస్, పరతాపనేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# సత్తుపల్లికి జ్వరమొచ్చింది..

- ఇంటింటా జ్వర బాధితులు
- టైఫాయిడ్, డెంగీ కేసుల దడ..
- వైద్య శిబిరాలతో ఆరోగ్యశాఖ అప్రమత్తం..



డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అవినాష్, మున్సిపల్ అధికారులు (ఫైల్)



సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో ఓపీ వద్ద రద్దీ..

**సత్తుపల్లిటౌన్:** సత్తుపల్లి జ్వరమొచ్చింది.. విష జ్వరాలు ప్రజలను వణికిస్తున్నాయి. డివిజన్ వ్యాప్తంగా పల్లెలు, పట్టణాల్లో ఏ ఇంటా చూసినా జ్వరపీడితులే కన్పిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు.. వాతావరణ మార్పులతో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. వర్షాలకు మురుగునీరు ఖాళీ స్థలాల్లో నిలిచిపోవటంతో దోమలబెడద ఎక్కువై అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. ఎక్కువగా టైఫాయిడ్, డెంగీ వంటి విష జ్వరాలు పెరుగుతుండటం.. ప్లేట్‌లెట్స్ పడిపోవపటంతో ఆందోళన చెందుతున్నారు.

**ఆస్పత్రికి క్యూ కడుతున్న బాధితులు..**

సత్తుపల్లి ఏరియా ఆస్పత్రిలో జూలైలో.. 251, ఆగస్టులో 597, సెప్టెంబర్‌లో 1,150 మంది జ్వరపీడితులు రక్తపరీక్షలు చేయించుకున్నారు. సత్తుపల్లి ఏరియా ప్రభుత్వాస్పత్రిలో ఉదయం 8 గంటల నుంచే రోగులు క్యూ కడుతున్నారు. గతంలో రోజుకు 100 మంది రోగుల ఓపీ ఉంటే.. ప్రస్తుతం 250 మంది వరకు ఓపీ ఉంటుందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. వీరిలో సగానికి పైగా జ్వరపీడితులే.

**మంచానికే పరిమితం..**

దగ్గు, జలుబు, తలనొప్పి, వాంతులు, విరోచనాలు, కీళ్ల నొప్పులతో మొదలవుతున్న జ్వరం వారం పదిరోజుల వరకు తగ్గటం లేదని జ్వరపీడితులు వాపోతున్నారు. వీరిలో ఎక్కువగా చిన్న పిల్లలపైనే ప్రభావం చూపుతుంది. ఇంట్లో ఎవరికైనా జ్వరం వస్తే మిగతా కుటుంబ సభ్యులకు క్రమేనా సోకుతుంది. విషజ్వరాల బారినపడి అతలాకుతలం అవుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వేలాది రూపాయలు ఖర్చు అవుతుండటంతో సామాన్య ప్రజలు జేబులకు ఖాళీ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లలేక అవస్థలు పడుతున్నారు.

**ఇంటింటికీ వెళ్లి అవగాహన..**

సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండటంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కాలనీలు, ఆరోగ్య ఉపకేంద్రాల పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేస్తున్నారు. ఇంటి పరిసరాలలో పరిశుభ్రతపై ప్రతి మంగళ, శుక్ర వారాలలో మున్సిపల్, పంచాయతీ యంత్రాంగం సహకారంతో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పిస్తున్నారు. డ్రైడే పాటించాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పించటంలో నిమగ్నమయ్యారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

- ఇంటి పరిసరాలలో దోమలు వృద్ధి చెందకుండా పరిశుభ్రత పాటించాలి.
- ఇళ్ల వద్ద నీటి గుంతలు, నిల్వ నీరులేకుండా చూసుకోవాలి.
- దగ్గు, జలుబు ఉన్నట్లైతే ఇతరులకు సోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.
- కాచి చల్లార్చిన నీటినే తాగాలి.. వేడి ఆహారాన్ని తీసుకోవాలి.

#### పిల్లలిద్దరికీ డెంగీ జ్వరం..



మా పిల్లలు ఎం.అజయ్‌బాబు, ఎం.షారూన్‌లకు దగ్గు, జలుబు, కీళ్ల నొప్పుల, కళ్లు మంటలతో జ్వరం వచ్చింది. ఆస్పత్రిలో చూపిస్తే ఇప్పటికే రూ.13వేలు ఖర్చు అయింది. దోమలు విపరీతంగా ఉన్నాయి. పిల్లలకు డెంగీ జ్వరాలు రావటంతో పదిరోజులకు పైగా చికిత్స పొందాల్సి వచ్చింది.

– ఎం.వీరస్వామి, సత్తుపల్లి

#### జ్వర సర్వే చేస్తున్నాం..



జ్వరం వస్తే అశ్రద్ధ చేయొద్దు.. ఆరోగ్య బృందాలు ఇంటింటా జ్వర సర్వే నిర్వహించి మందులు అందజేస్తున్నారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి. ప్రతి వాడలో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. – డాక్టర్ టి.సీతారాం, డిప్యూటీ డీఎంహెచ్ఓ, సత్తుపల్లి

# బతుకమ్మ చీరలు పంపిణీ

**సత్తుపల్లిటౌన్:** తెలంగాణ ప్రభుత్వం అన్ని పండుగలను గౌరవిస్తుందని.. బతుకమ్మ పండుగను సాంప్రదాయంగా నిర్వహించేందుకు ప్రోత్సహిస్తోందని సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అదే విధంగా పటణంలోని పలు వార్డుల్లో కౌన్సిలర్లు బతుకమ్మ చీరలను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, కౌన్సిలర్లు ఎస్‌కె ఛాంద్‌పాషా, నడ్డి ఆనందరావు, మేకల భవాని, మట్టా ప్రసాద్, అద్దంకి అనీల్, ఎస్‌కె నాగుల్‌మీర, గుండ్ర రాఘవేందర్, జిన్ను పాల్గొన్నారు.



మహిళలకు బతుకమ్మ చీరలను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేష్, తదితరులు

### కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



మాట్లాడుతున్న మాజీమంత్రి చంద్రశేఖర్

**కల్లూరురూరల్:** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మాజీమంత్రి, పీసీసీ ఉపాధ్యక్షుడు సంభాని చంద్రశేఖర్ అన్నారు. కల్లూరుకు సమీపంలోని రామకృష్ణాపురం వద్ద బెల్లం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం లీడర్ షిప్ డెవలప్‌మెంట్ మిషన్ ఫెసిలిటేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రతి ఇంటికీ తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, కొండూరి కిరణ్‌కుమార్, పెద్దబోయినదుర్గా ప్రసాద్, దగ్గుల రఘుపతిరెడ్డి, అప్పారావు, సోమిరెడ్డి, సాల్మన్‌రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణయ్య, వంశీ, లక్ష్మణ్‌రావు, జనార్దన్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### ఆశా కార్యకర్తల బిక్షాటన

**ఎర్రుపాలెం:** మండలకేంద్రంలో గురువారం ఆశా కార్యకర్తలు బిక్షాటన చేశారు. వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి సగ్గుర్తి సంజీవరావు మాట్లాడుతూ.. ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పెండింగ్ బిల్లులు, ప్రమాద బీమా, గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నూతక్కి నర్సింహారావు, ముక్కపాటి శ్రీనివాసరావు, దేవరకొండ కోటేశ్వరరావు, వైఎస్సార్‌టీపీ నాయకులు దేవరకొండ భూషణం, ఆశా కార్యకర్తలు సుధారాణి, వీరబాల, వెంకటనర్సమ్మ, మేరీ సరోజిని, రమాదేవి, దేవకర్ణ, దుర్గభవాని, విజయమ్మ, మరియమ్మ పాల్గొన్నారు.

### క్రీడా పోటీల్లో ఓవరాల్ చాంపియన్ బోనకల్

**బోనకల్:** తనికెళ్ల బీసీ గురుకుల పాఠశాలలో ఈ నెల 1 నుంచి 4 వరకు జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో బోనకల్ మహాత్మా జ్యోతీబాపూలే విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ఆర్‌సీఓ అంజలి అందించారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ నిలిచిన విద్యార్థులను ప్రిన్సిపల్ సుష్మ, పీఈటీ వెంకట్రావు, అధ్యాపకులు అభినందించారు.

### మిర్చి మొక్కలు తొలగించిన దుండగులు

**తల్లాడ:** మండలంలోని మంగాపురంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మిర్చితోటలో మొక్కలను తొలగించారు. గ్రామానికి చెందిన పరుచూరి రెడ్డియ్య తోటలో ఎనిమిది సాళ్లను సదరు వ్యక్తులు తొలగించడమే కాక స్టార్టర్ బాక్స్‌ను పగులగొట్టారు. ఈమేరకు గురువారం ఉదయం గుర్తించిన రెడ్డియ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### కానిస్టేబుళ్లుగా గ్రామీణ వాసులు


**ముదిగొండ:** వారంతా మారుమూల పల్లెటూరు వాసులే, పట్టుదలతో చదవి ఉద్యోగాలు సంపాదించారు. మండలంలోని వల్లబిలో కణితి గోపాలకృష్ణ ఫైర్ కానిస్టేబుల్‌గా, బిచ్చాల రాము సివిల్ కానిస్టేబుల్‌గా.. గంధసిరిలో పరికపల్లి సందీప్ ఫైర్ కానిస్టేబుల్‌గా.. బాణాపురంలో బెందు వీరబాబు, మరికంటి మురళి, జంగం పవన్‌కుమార్ లు సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు.

### శివాలయం ప్రధాన అర్చకుడు మృతి

**తల్లాడ:** తల్లాడ శివాలయం ప్రధాన అర్చకుడు నుదురుపాటి ప్రసాద్ శర్మ(66) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతి పట్ల తల్లాడ పట్టణంలోని ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సంతాపం ప్రకటించారు. భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ఎర్రుపాలెం/కొణిజర్ల:** తమ సమస్యలపై మధ్యాహ్న భోజన కార్మికులు ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని టీపీటీఎఫ్ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.హనుమంతరావు, భాష్‌స్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ రంజాన్ తెలిపారు. ఎర్రుపాలెం మండలకేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం ఎదుట, కొణిజర్ల మండలంలో భోజన కార్మికుల సమ్మెకు వారు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు హనుమా, శాంతయ్య, కనపర్తి గిరి, మధ్యాహ్న భోజన వర్కర్లు పద్మ, కవిత, తిరపతమ్మ, కాటమ్మ, సైదమ్మ, మణెమ్మ, సుజాత, నాగేంద్ర, సుశీల, పద్మావతి, వనజ, సక్కుబాయి, బేబీ, రాణి, సీఐటీయూ మండల కార్యదర్శి సగ్గుర్తి సంజీవరావు, టీపీటీఎఫ్ నాయకులు ఎం సూర్యనారయణ తదితరులు పాల్గొన్నారు.



కొణిజర్ల: సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

### వైద్య శిబిరం విజయవంతం

**ఎర్రుపాలెం:** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం బనిగండ్లపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జ్వరం, జలుబు, దగ్గు, షుగర్, బీపీ, తదితర వ్యాధులతో బాధపడుతున్న 106 మందికి డాక్టర్ సమీర వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ మస్తాన్‌వలీ, గ్రామ కార్యదర్శి నాగేశ్వరరావు, హెచ్ఈఓ సదాశివరావు, సూపర్‌వైజర్లు జె.వెంకటేశ్వరరావు, పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి, ఏఎన్ఎం స్నేహ తదితరులు పాల్గొన్నారు.

**పశువైద్య శిబిరం..**

**బోనకల్:** మండలంలోని రామాపురం గ్రామంలో గురువారం నిర్వహించిన పశువైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ తొండపు వేణు ప్రారంభించారు. 32 ఆవులకు గేదెలకు గర్భకోశ వ్యాధి చికిత్స నిర్వహించారు. దూడలకు నట్టల నివారణ మందులను తాగించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి ప్రవీణ్, గోపాలమిత్రలు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**ఎర్రుపాలెం:** మండలంలోని భీమవరం, తక్కెళ్లపాడు, ఎర్రుపాలెం గ్రామాల్లో సాయిబాబా ఆలయాల్లో గురువారం బాబా విగ్రహాలకు శాస్త్రోక్తంగా అర్చకులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. బాబాకి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో పలువురు దాతలు మీనవోలు జగన్నాధరావు, తల్లపురెడ్డి చిరంజీవి, కార్తీక్ కుమార్‌రెడ్డి, పంబి వెంకటనారాయణ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షులు సాంబశివరావు, నాయకులు పాల్గొన్నారు.

### స్వామినాథన్‌కు భారతరత్న ప్రకటించాలి

**వైరారూరల్:** హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని గొల్లెనపాడు, పాలడుగు గ్రామాల్లో గురువారం నిర్వహించిన స్వామినాథన్ సంస్కరణలో సభలో ఆయన మాట్లాడారు. స్వామినాథన్ వ్యవసాయ అభివృద్ధికి, రైతాంగానికి చేసిన సేవలకు గాను.. భారతరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. తోట నాగేశ్వరరావు, కిలారు శ్రీనివాసరావు, షేక్.మజీద్, నల్లమోతు వెంకటనారాయణ, చంద్ర ప్రసాద్, వెంపటి రాజా, ఆళ్ల శ్రీనివాస్, అబ్దుల్ రహమాన్, మోలాలీ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**సత్తుపల్లిరూరల్:** మండలంలోని గంగారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని రూరల్ ఏఈ సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

**వైరా:** అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. గురువారం వైరా మున్సిపాలిటీలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మున్సిపాలిటీలో 20 వార్డులు ఉండగా ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసిందన్నారు. ప్రతీ వార్డులో సీసీరోడ్లు, డ్రెయిన్లు తదితర నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.3 కోట్లుతో డంపింగ్ యార్డ్ నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. అనంతరం స్థానిక రైతు వేదికలో మహిళలకు బతుకమ్మ చీరలు, క్రీడా మైదానాలకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, వైస్ చైర్మన్ సీతారాములు, ఎంపీపీ పావని, జెడ్పీటీసీ కనకదుర్గ, ఏఎంసీ చైర్మన్ మోహన్‌రావు, కృష్ణార్జునరావు, కమిషనర్ వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు సతీష్, ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి తహసీల్దార్ కేవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్, మున్సిపల్ చైర్మన్ జైపాల్

# న్యాయం చేయండి సారూ..



బాధితులతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

**మధిర:** మధిర పట్టణంలోని ఒంటరి మహిళ చిమ్మసర్తి సామ్రాజ్యం తనకు గృహలక్ష్మి పథకానికి ఎంపిక చేయాలని గురువారం మధిర తహసీల్ ఎదుట నిరసన దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆమె పట్టణంలో 40 సంవత్సరాలుగా పిల్లలతో అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నా. అద్దె చెల్లించలేక, అనారోగ్యంతో బాధపడుతున్న నా కుమారుడు నాగేశ్వరరావుకు చికిత్సకోసం డబ్బులు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నా. తెలంగాణ వచ్చినప్పటి నుంచి డబుల్ బెడ్రూం వస్తుందని ఆశగా ఎదురుచూశా. కానీ రాలేదు.. దీనికి తోడు ఇంటి స్థలంలో ఇళ్లు నిర్మించుకుందామంటే గృహలక్ష్మికి అధికారులు ఎంపిక చేయడం లేదు. అన్ని అవకాశాలు ఉన్నవారందరికీ వచ్చి నాకు రాక పోవడం ఎంటని ప్రశ్నించారు. బహుశా మాలాంటి వారికి న్యాయం జరగదేమో..? విషయం తెలుసుకున్న దెందుకూరు, ఖమ్మంపాడు తదితర గ్రామాలకు చెందిన గృహలక్ష్మి పథకం కింద ఎంపిక కాని మరి కొంతమంది నిరుపేదలు కూడా వచ్చి ఈ దీక్షలో కూర్చున్నారు. ఈ దీక్షకు సీపీఎం నాయకులు పాపినేని రామనరసయ్య, శీలం నరసింహారావు, మందా సైదులు తదితరులు సంఘీభావం తెలిపారు. తహసీల్‌కు వచ్చిన ట్రైయినీ కలెక్టర్ మయాంక్ సింగ్‌ని సీపీఎం నాయకులు పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా ట్రైయినీ కలెక్టర్ మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకం మంజూరు లిస్టులో అర్హులైన వారి పేర్లు వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో నిరసనకారులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్, సీపీఎం నాయకులు పడకంటి తదితరులు పాల్గొన్నారు.

# సమ్మె విరమణ తాత్కాలికమే..

**సత్తుపల్లి:** ఈ నెల 14వ తేదీలోపు మంత్రులు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే మరోసారి సమ్మెకు దిగుతామని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు స్పష్టం చేశారు. గురువారం సత్తుపల్లిలో చేపట్టిన సమ్మె శిబిరంలో సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల నాయకులు మాట్లాడారు. అక్టోబర్ 4న నిర్వహించిన ఛలో హైద్రాబాద్ కార్యక్రమానికి ప్రభుత్వం తలొగ్గి చర్చలు నిర్వహించిందని తెలిపారు. సమ్మెకు సంపూర్ణ సహకారం అందించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘాల బాధ్యులు మోరంపూడి పాండు, రావుల రాజబాబు, జాజిరి శ్రీనివాసరావు, చలమాల విఠల్, పి.ఝాన్సి, జ్యోతి, చంద్రశేఖర్, కొలికపోగు సర్వేశ్వరరావు, సుశీల, ఉదయశ్రీ, పద్మ, లలిత, రత్నకుమారి పాల్గొన్నారు.



సమ్మెలో పాల్గొన్న సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల నాయకులు

# విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం



విశ్రాంత ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న వయోవృద్ధుల సంఘం బాధ్యులు

**మధిర:** ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వయోవృద్ధుల వారోత్సవాలు పురస్కరించుకొని గురువారం మధిర పూర్వ విద్యార్థి సంఘం, వయోవృద్ధుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మధిర పాఠశాలలో చదువుకొని ఉపాధ్యాయులుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొంది, వృద్ధాప్యం, అనారోగ్యంతో మధిరలో తమ ఇళ్లకే పరిమితమైన వారిని గుర్తించి శాలువా, మెమెంటోతో సన్మానించి పండ్లు పంపిణీ చేశారు. సన్మాన గ్రహీతల్లో బోడేపూడి విశ్వనాథం, చలువాది జనార్దన్ రావు, కొంకా నారాయణ, చెడే రామ కోటేశ్వరరావు, బచ్చలకూరి సుగుణమ్మ, చిలువేరు దానమ్మ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వై ప్రభాకర్, ఆల్ ఇండియా సీనియర్ సిటిజన్స్ కాన్ఫిడరేషన్ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు మాధవరపు నాగేశ్వరరావు, పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షులు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, ఇరుకుళ్ల లక్ష్మీనరసింహారావు, వై.పద్మావతి, కటుకూరి రామారావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### ‘భరత్’ విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**మధిర:** ఓటు హక్కుపై అవగాహన కల్పించేలా నిర్వహించిన లఘు నాటిక రాష్ట్రస్థాయి పోటీల్లో మధిరకు చెందిన భరత్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో భరత్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించగా కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాజీవ్ కుమార్, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వికాస్‌రాజ్ అభినందించారు. ఈసందర్భంగా విద్యార్థులకు భరత్ విద్యా సంస్థల అధినేత శీలం విద్యాలత వెంకటరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

### వన్యప్రాణులకు హాని తలపెట్టొద్దు..



అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

**సత్తుపల్లిరూరల్:** వన్యప్రాణులకు ఉచ్చులు, కరెంట్ తీగలతో హాని తలపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని సత్తుపల్లి, రుద్రాక్షపల్లి సెక్షన్ ఆఫీసర్లు నర్సింహా, మంగారావులు హెచ్చరించారు. గురువారం రాత్రి సత్తుపల్లి మండలం కాకర్లపల్లి, రుద్రాక్షపల్లి, కొమ్ముగూడెం, బాసారం, గాంధీనగరం, బుగ్గపాడులలో వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైల్డ్ లైవ్ ఎక్స్‌పర్ట్ దీపక్ నారాయణ్, బీట్ ఆఫీసర్లు నర్సింహారావు, మల్లయ్య, కృష్ణ, మాన్సింగ్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# పాదయాత్రను జయప్రదం చేయాలి



చింతకాని: మాట్లాడుతున్న రాంబాబు

**చింతకాని/ముదిగొండ:** పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఈ నెల 7వ తేదీన మందకృష్ణ మాదిగ ఆలంపూర్‌ను ప్రారంభిస్తున్న విశ్వరూప మహా పాదయాత్రను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గుండ్ల రాంబాబు, ఎమ్మెస్పీ మండల ఇన్‌చార్జ్ కొలికపాంగు వెంకట్రావు మాదిగ తెలిపారు. చింతకాని మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ముదిగొండలో మాదిగల విశ్వరూప మహాపాదయాత్ర వాల్ పోస్టర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణమాదిగ చేస్తున్న పాదయాత్రలో ఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పగిడిపల్లి రవీందర్, నాయకులు జొన్నలగడ్డ పుల్లారావు, గుర్రం రాజేష్, గుడిపాటి పవన్, గుంటి అరవింద్, ఎంఎస్పీ నాయకులు పులిపాటి ప్రకాష్ మాదిగ, రామకృష్ణ మాదిగ, గురువయ్య మాదిగ, వీరబాబు మాదిగ తదితరులు పాల్గొన్నారు.